జగన్నాథ రథయాత్ర

దేశ, విదేశాల నుంచి వచ్చిన భక్తులు

హరే కృష్ణ..



శ్రీ జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు తదితరులు



ఆల్విన్‌కాలనీ: హరే కృష్ణ.. హరే రామ సంకీర్తనల నడుమ జగన్నాథ రథయాత్ర మంగళవారం కూకట్‌పల్లి ప్రధాన రహదారి మీదుగా కొనసాగింది. రథయాత్రలో జగన్నాథ నామస్మరణతో మార్మోగాయి. కూకట్‌పల్లి అంతర్జాతీయ ఇస్కాన్ సంస్థ డైరెక్టర్ మహా శృంగదాస్ ఆధ్వర్యంలో ఈ రథయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర అగర్వాల్ సమాజ్ అధ్యక్షులు అంజనీకుమార్ అగర్వాల్ హాజరై బంగారు చీపురులతో రథయాత్ర ముందు ప్రాంతాన్ని ఊడ్చి ప్రారంభించారు. ఈ రథయాత్ర హైదర్‌నగర్ పోచమ్మ దేవాలయం నుంచి జేఎన్‌టీయూ, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి వై జంక్షన్ వరకు నయనానందకరంగా కొనసాగింది.ఈ యాత్రలో రష్యా, జర్మనీ, ఇటలీ, ఆస్ట్రేలియా, అమెరికా, కెనడా, నైజీరియా ప్రాంతాల నుంచి ఇస్కాన్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిపారవశ్యంలో వారు శ్రీకృష్ణుడి సంకీర్తనలు ఆలపిస్తూ.. నృత్యాలు చేసిన తీరు అందరినీ ఆకట్టుకుంది. రథయాత్ర ముందు రంగురంగుల రంగవల్లులు అద్దుతూ, భగవద్గీత శ్లోకాలు పఠిస్తూ ముందుకు సాగారు. రాధాకృష్ణ వేషధారణలలో చిన్నారులు సందడి చేశారు. రథయాత్రలో ఇస్కాన్ ప్రతినిధులు జై శ్రీకృష్ణ, మనోజ్, అనిల్, వెంకటేశ్వరరావు, అభిషేక్ ఉత్తం, యతీష్, దిలీప్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



హరే రామ













నల్ల చెరువును రక్షించండి

కూకట్‌పల్లి డివిజన్ కాలనీ అసోసియేషన్ల నాయకుల డిమాండ్



రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్, కాలనీల నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని నల్ల చెరువును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని కాలనీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో కలిసి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో నల్ల చెరువును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం చెరువును రక్షించాలని రెవెన్యూ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. కూకట్‌పల్లి డివిజన్‌లో నల్ల చెరువు ప్రాంతంలో యూఎల్‌సీ లాండ్‌లను పట్టా భూములుగా చూపిస్తూ కబ్జా చేస్తున్నారని తెలిపారు. స్థానికంగా చెరువును కబ్జా చేయటం వల్ల భూగర్భ జలాలు అడుగంటడమే కాకుండా కూకట్‌పల్లి డివిజన్‌లో ఉద్యానవనాల వంటి మౌలిక వసతులు లేక కాలనీవాసులు ఎన్నో అవస్థలకు గురవుతున్నారని వారు తెలిపారు.

◆ కూకట్‌పల్లిలో ఏడున్నర ఎకరాల చెరువు మినహాయించి మిగిలిన బఫర్ జోన్‌లో ఉద్యానవనాలు, వాకింగ్ ట్రాక్‌లు, సీనియర్ సిటిజన్ పార్కులు, మహిళా పార్కులను ఏర్పాటు చేయాలని వారు కోరారు. కాంక్రీట్ జంగిల్‌గా ఉన్న ఈ కూకట్‌పల్లి ప్రాంతంలో కొంతమంది గుత్తాధిపత్యంగా బఫర్ ప్రాంతాలలో కూడా ఇళ్ల నిర్మాణాలు చేపట్టి అధికారులకే సవాల్ విసురుతున్నారని కాలనీవాసులు ఆరోపించారు.

◆ నల్ల చెరువు అభివృద్ధి చేయటం కోసం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రూ.100 కోట్ల నిధులు తీసుకువచ్చినా కొంతమంది కోర్టుల పేరుతో అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. నల్ల చెరువు ప్రాంతంలో అభివృద్ధి పనులను వెంటనే చేపట్టడానికి అందరూ సహకరించాలని వారు కోరారు.

◆ ఇటీవల కాలంలో కొంతమంది చెరువు ప్రాంతంలో రేకుల షెడ్డులతో నిర్మాణాలు చేపట్టి కబ్జాలు చేపడుతున్నారని వెంటనే వాటిని తొలగించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో పాటు కాలనీ అసోసియేషన్ నాయకులు జగ్గారావు, ప్రభాకర్ రావు, ప్రభాకర్, యాదగిరిరావు, శాంతకుమార్, విశ్వనాథరాజు, కామేశ్వరరావు, రాంచందర్‌రావు, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధికి కలిసి రావాలి..

ఎమ్మెల్యేపై బురద చల్లేందుకు నిరాధారమైన విమర్శలు చేస్తూ ప్రజల్లో మెప్పు పొందాలని ప్రయత్నించే వారికి చెంపపెట్టు తప్పదని కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అన్నారు. ఎమ్మెల్యే కృష్ణారావు కబ్జా చేసినట్లుగా నిరూపించలేక ప్రత్యర్థి నాయకులు తోక ముడిచారన్నారు. కూకట్‌పల్లి నల్ల చెరువులో కబ్జాలలో ఉన్న ఆక్రమణలు తొలగించాలని తమతో పాటు వారు కూడా అధికారులకు విన్నవించాలని సవాల్ విసిరారు. చిత్తశుద్ధి ఉంటే నల్ల చెరువు అభివృద్ధికి ఎమ్మెల్యేతో కలిసి ముందుకు రావాలన్నారు.



కూకట్‌పల్లి నల్ల చెరువులో కబ్జా చేసి వేసిన రేకుల షెడ్డులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, వివిధ కాలనీ అసోసియేషన్ నాయకులు

క్లుప్తంగా

ఘనంగా మాధవరం సుదర్శన్‌రావు జయంతి



కూకట్‌పల్లి: పేదల పక్షపాతిగా పనిచేసి, తెలంగాణ ఉద్యమంలో కీలకంగా శ్రమించిన మాధవరం సుదర్శన్‌రావు సేవలు మరువలేనివని శాసనమండలి సభ్యులు కె. నవీన్ కుమార్ తెలిపారు. మలిదశ ఉద్యమకారుడు సుదర్శన్‌రావు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కూకట్‌పల్లి ఏవీబీ పురంలో సుదర్శన్‌రావు అభిమానులు ఏర్పాటు చేసిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్‌చేశారు. అనంతరం పేదలకు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్‌రావు కుటుంబ సభ్యులు అభిలాష్ రావు, సురభి నవీన్‌రావు, బీఆర్ఎస్ నాయకులు రఘునందన్ నేత, టీఎస్‌టీఎస్ చైర్మన్ పాటిమీది జగన్మోహన్ రావు, కపిల్‌రాజు, మల్లేష్‌యాదవ్, మొలుగు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి కాల్వ పనులు త్వరగా పూర్తి చేయాలి

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నందమూరి నగర్‌లో రూ.40 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న వరద నీటి కాల్వ నిర్మాణ పనులను మంగళవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పనులను త్వరగాపూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రతి కాలనీలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు.

నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు

కేపీహెచ్‌బీకాలనీ: మలేషియన్ టౌన్‌షిప్ నార్త్ ఫేజ్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ 2023–25 సంవత్సరానికి ఎన్నికైన నూతన సభ్యులు మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్యానల్ సభ్యులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పున్నారావు, వేణుగోపాల్, రాజా వెంకటరావు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చదువుల దినోత్సవం

- నూతన పాఠశాల భవన నిర్మాణం చేయిస్తా : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- పిల్లల భవిష్యత్‌కు ఎన్ని కోట్లైనా ఖర్చు చేసేందుకు సిద్ధం
- మేనమామలా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తా



హస్మత్‌పేట పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికి మేనమామలా సకల సౌకర్యాలు కల్పించడంతో పాటు పాఠశాల భవనాలను నిర్మిస్తానని.. దీనికి వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా విద్యా దినోత్సవాన్ని కూకట్‌పల్లి నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించారు. హస్మత్‌పేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణారావు పాల్గొని తన సొంత నిధులతో నోట్ పుస్తకాలు, పెన్నులు, బ్యాగ్, వాటర్ బాటిల్ కిట్లను స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్‌తో కలసి పంపిణీ చేశారు. హస్మత్‌పేట పాఠశాలలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండటంతో పాఠశాలను విశాలమైన స్థలంలో ఏర్పాటు చేయాలని హెచ్‌ఎం ఎమ్మెల్యేను కోరారు. దీనికి స్పందించిన ఆయన నూతన భవనం నిర్మాణం చేసి ఇస్తామని హామీ ఇచ్చారు. విద్యతో పాటు క్రీడలు, డిజిటల్, సామాజిక, ఆధ్యాత్మిక అంశాలపై అవగాహన కల్పించాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు.

11వేల మందికి స్టడీ కిట్లు అందిస్తున్నాం..

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతేడాది మాదిరిగానే నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 11వేల మంది విద్యార్థులకు స్టడీ కిట్లను అందిస్తున్నామన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 700 మందికి ఈ కిట్లను అందించామన్నారు. 'మనఊరు మనబడి'లో భాగంగా పాఠశాలలో డిజిటల్ క్లాస్‌లను ప్రారంభించామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి పౌష్టికాహారం అందిస్తూ సీఎం కేసీఆర్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యుత్ కష్టాలు తలెత్తకుండా సోలర్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

నేటి బాలలే రేపటి దశదిశ నిర్దేశకులు..

నేటి బాలలే రేపటి దేశానికి దశదిశ నిర్దేశకులుగా తయారు అవుతారని ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. ప్రభుత్వ నిధులు ఉన్నా లేకున్నా తనతో పాటు దాతల సహాయంతో పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. గతంలో కరెంట్ బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉంటే తాను, కార్పొరేటర్ బిల్లులు కట్టామని గుర్తు చేశారు. పిల్లల భవిష్యత్ మనందరి బాధ్యత అని అన్నారు. అనంతరం ఎండలు ఎక్కువగా ఉండటంతో విద్యార్థులకు రాగి జావాను అందించి వారి దాహార్తిని తీర్చారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయులు మల్లయ్య ఉపాధ్యాయులు, నాయకులు కర్రె జంగయ్య, మక్కాల నర్సింగ్‌రావు, సయ్యద్ ఎజాజ్, గడ్డం నర్సింగ్‌రావు, ఇర్ఫాన్, మేకల హరినాథ్, బుర్రి యాదగిరి, పోచయ్య, మట్టి శ్రీను, గణేష్, ఉదయరాణి తదితరులు పాల్గొన్నారు.



స్టడీ కిట్లు అందుకున్న ఆనందంలో బ్యాగ్‌లను చూపిస్తున్న విద్యార్థులు

పలువురికి పార్కుల నిర్వహణ బాధ్యతలు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్ 3వ ఫేజులో పార్కులను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పార్కుల నిర్వాహకులు, కాలనీల కమిటీ సభ్యులు, అధికారులతో మంగళవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అందరి సమ్మతితో పార్కుల నిర్వహణ బాధ్యతలను కొంతమందికి అప్పగించారు. అందులో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ చిల్డ్రన్ పార్కును, పంచవటి పార్కును పద్మకు, కొమరం భీమ్ మల్టీపర్పస్ గ్రౌండ్‌ను పండుకు, పీవీ సింధు బాడ్మింటన్ కోర్టును బాలుకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఈ పార్కులను ప్రజలందరూ ఉపయోగించుకొని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధికారులు డీఈ ఆనంద్, ఏఈ సాయి ప్రసాద్, యూబీడీ సమత, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డి, కట్టా నర్సింగరావు, మహబూబ్, జీఎల్ రెడ్డి, రాంబాబు నాయుడు, గఫూర్, రాము, భాస్కర్ నాయీ, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలతో సాధించేది ఏమీ లేదు

సినీ నటుడు, రచయిత తనికెళ్ల భరణి

కేపీహెచ్‌బీకాలనీ: ఆత్మహత్యలతో సాధించేది ఏమీ లేదని.. బతికుండి సాధించాలని.. అందుకు సమాజంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ప్రముఖ సినీనటుడు, రచయిత తనికెళ్ల భరణి అన్నారు. జేఎన్‌టీయూహెచ్‌లో మంగళవారం జరిగిన విద్యా దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ఆత్మహత్యలకు పాల్పడటం ద్వారా తల్లిదండ్రులను క్షోభ పెట్టవద్దని సూచించారు. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ మొదలుకొని అనేక మంది కడుపేదరికం నుంచి ప్రస్థానం మొదలుపెట్టి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు యత్నించే క్రమంలో నుంచే ఉన్నత స్థితికి ఎదిగినట్లు తెలిపారు. సూర్యోదయం కంటే ముందు లేచి తమ కార్యకలాపాలను నిర్దేశించుకొని లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు అడిగిన పలు సందేహాలకు తనదైన శైలిలో జవాబిచ్చి ఆకట్టుకున్నారు. శివుడిపై తాను రాసిన పలు గీతాలను పాడి ఆహుతులను అలరించారు. తెలంగాణ యాస, భాష, సంస్కృతి, సంప్రదాయాలు తనను ఎంతగానో ఆకట్టుకోవటంతో పాటు తన గుర్తింపునకు దోహదపడ్డాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీసీ ప్రొ.కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొ.మంజూర్ హుస్సేన్, రెక్టార్ ప్రొ.గోవర్ధన్, వివిధ విభాగాలకు చెందిన డైరెక్టర్లు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న తనికెళ్ల భరణి

కేసీఆర్‌ను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు

• మాధవరం కాంతారావు



బాలానగర్: 'మరోసారి మోదీ సర్కార్.. ఈసారి తెలంగాణలో బీజేపీ సర్కార్'అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కేసీఆర్ పాలన వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్నామని మంగళవారం కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు అన్నారు. బీజేపీ భరోసా పాదయాత్రలో బాలానగర్ డివిజన్‌లోని పూల్‌బాగ్ కాలనీ, ఫిరోజ్‌గూడలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా రైల్ అండర్ బ్రిడ్జి కింద నీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోందన్నారు. ఎమ్మెల్యే దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనం వృథా చేస్తున్నారని అన్నారు. కేవలం కబ్జాలు, అక్రమ కట్టాడాలపై అధికారాన్ని ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ప్రజల సమస్యలు తీర్చడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని రంగాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కేసీఆర్‌ను నమ్మే పరిస్థితిలో తెలంగాణ ప్రజలు లేరని అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌ను ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు.



అల్లాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో లైబ్రరీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం



కేపీహెచ్‌బీకాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు



హైదర్‌నగర్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసిన కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు



కూకట్‌పల్లిలో నోటు పుస్తకాలు, యూనిఫాంలు అందజేస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

విద్యా దినోత్సవం.. పిల్లలకు అక్షరాభ్యాసం

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవాన్ని కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, వాటర్‌బాటిల్స్ పంపిణీ చేశారు. అదే విధంగా చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ.. సర్కారు పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు వారికి మధ్యాహ్న భోజనం,ఉచిత యూనిఫాం, పుస్తకాలు అందిస్తున్నామన్నారు. పాఠశాలల్లో లైబ్రరీలు, డిజిటల్ తరగతులు, మినరల్ వాటర్, సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారాలతో అన్ని పాఠశాలలు ఆధునీకరిస్తున్నామని తెలిపారు. చదువుకోలేని చిన్నారులను సైతం బడిబాట పట్టించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు.

